# అలుక్కుపోయిన చిత్రం

వ్యాపారరీత్యా నేను వచ్చిన పని ఆరోజు సాయంత్రమే అయి పోయింది. న్యాయంగా నేను ఆరాత్రి పదిగంటల లోపునే మద్రాసు నగరాన్ని వదిలివేయవచ్చు. కాని ఎందువల్లనో నాకు అంతఅర్థంటుగా చెన్నపట్నాన్ని వదిలివేయ బుద్ధికాలేదు.

నాకు ఇలా అనిపించటానికి తగిన కారణమే వుంది. కొన్నేళ్ళ క్రితం నేను కొన్నాళ్ళు నేను మద్రాసు నగరవాసినే. పదహారేళ్ళక్రితం నేను ఆ నగరాన్ని వదిలివేశాను. నేను వ్యాపారంలోకి దిగకుండా వున్నట్లయితే ఇన్నాళ్ళకయినా మద్రాసును సందర్శించవలసిన అవ సరం కలిగివుండేదో కాదో చెప్పలేను.

అయిదు రోజులక్రితం వ్యాపారాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకురావటానికి కొంతమందిని కలిసి చర్చించటానికి మద్రాసు రావటం జరిగింది. అనుకున్న రీతినే పనులన్నీ పూర్తయినాయి.

సంతోషించా !

ఆరోజు సాయంత్రం నాలుగు గంటల ప్రాంతాన చివరిసారిగా ఒకపెద్ద హోటల్లో దొరైస్వామిని కలిసి వచ్చిన తర్వాత ఇక రాజమండ్రి బయల్దేరితే సరిపోతుందని గాలి పీల్చుకున్నాను కాని మనసు అందుకు ఎదురు తిరిగింది. నేను బసచేసిన హోటల్లో స్నానం చేసి, టిఫిన్ ముగించుకుని టాక్సీలో అడయార్ బీచ్‌కి వెళ్ళాను. ఒకప్పటి నా ఆనందాన్ని, అనుభూతుల్ని తిరగదోడుకుని తొమ్మిది గంటల వేళ హోటల్‌కు చేరుకున్నాను.

భోజనమయింది.

అలసటగా వున్నా, విశ్రాంతి తీసుకోవాలనిపించలేదు. అందుకే హోటల్ నుంచి బయటపడి రోడ్డెక్కాను.

బాగా చలిగావుంది. డిసెంబర్ నెల ఆఖరిరోజులు. ఒక సిగరెట్టు ముట్టించుకొని, చేతులు వెనక్కు పెట్టుకుని గమ్యంలేని వాడిలా రోడ్డుమీద నడక సాగించాను.

చలికాలం కావటం వల్లనేమో వీధుల్లో అంతగా జనసంచారం లేదు. ఉండీ ఉండీ టాక్సీలూ, బస్సులు దూసుకుపోతున్నాయి. చలికి ముడుచుకుపోయి బాధపడుతున్న ఇళ్ళనూ, శాపాన్ని అనుభవిస్తున్నట్టు పడి ఉన్నరోడ్లనూ చూస్తుంటే నా గత జీవితం గుప్పున కళ్ళముందు కదిలింది.


ఆరోజు కూడా ఇంతే.

రాజమండ్రి నించి పారిపోయి మద్రాసు వచ్చిన రోజు కూడా ఇలాగే దారీతెన్నూ లేకుండా పిచ్చివాడిలా ఇష్టం వచ్చినట్లు రోడ్లవెంట తిరిగాను.

రాజమండ్రి నించి నేను మద్రాసు పారిపోయి రావటానికి ఒక కథ వుంది.

అప్పటికి నాకు ఇరవై ఏళ్ళు కూడా లేవు. పి.యు.సి. పాసయి అప్పటికే రెండేళ్ళు కావస్తోంది. మంచి మార్కులతోనే పాసయ్యాను. డిగ్రీ చదువుతానంటే మానాన్న తనకు ఓపిక లేదన్నాడు. చదువు దామనే ఉత్సాహాన్ని బలవంతంగా సమాధిచేసి ఉద్యోగం కోసం అన్వేషణ మొదలుపెట్టాను.

కనిపించిన ప్రతి ఉద్యోగానికీ అప్లికేషన్లు పెట్టాను. ఎక్కడ ఖాళీగా ఉందని తెలిస్తే అక్కడికల్లా వెళ్ళి ఉద్యోగం ఇవ్వమని బ్రతిమ



లాడాను. కాని ఎవ్వరూ ఇవ్వలేదు. చెప్పలేనంత నిరుత్సాహం నన్ను నిలువునా ఆవరించింది. మానాన్న ఒక ఎలిమెంటరీ స్కూలు టీచర్.

ఆయనకు వచ్చే జీతం ముగ్గురికి మించి సరిపోదు. అందుకే నాకు అంత చిన్న వయసులోనే ఉద్యోగం వెతుక్కోవలసిన అగత్యం ఏర్పడింది.

లంచమో, రికమెండేషనో లేకపోతే ఉద్యోగం రాదని రూఢిగా తెలిసిపోయింది. నాకు ఆరెండూ లేవు కాబట్టి ఉద్యోగం రాదు. అప్పటికే నాఉద్యోగం మా బంధువుల్లోనూ, స్నేహితుల్లోనూ, చివరికి మా ఇంట్లోను హాస్యాస్పదంగా తయారయింది. నన్ను హేళనచేస్తూ మాట్లాడటం మొదలుపెట్టారు.

ఆ పరిస్థితుల్లో ఏంచెయ్యాలో అర్థంకాలేదు. ఏదో అర్థం కాని ఆవేశం, ఎవరిమీదనో చెప్పలేని కసి....

తట్టుకోలేక పోయాను.

ఎక్కడికయినా పారిపోవాలనిపించింది. ఎందుకో ఆక్షణంలో నామనసులో మద్రాసు మెదిలింది. అంతే- ఇంట్లో కొంత డబ్బు కాజేసి రైలెక్కి మద్రాసు వెళ్ళిపోయాను.

స్టేషన్‌నించి బయటకు వచ్చిన తర్వాత ఎక్కడికి వెళ్ళాలో ఏం చెయ్యాలో అర్థం కాలేదు. జేబులో మిగిలిన రెండు రూపాయలతో ఆకలిబాధ తీర్చుకున్నాను.

అప్పటినించీ నడక మొదలు.

తిరిగిన రోడ్డు తిరక్కుండా తిరుగుతున్నాను. ఎంతో దూరం వెనక్కి వెళ్ళిపోతోంది. మెదడునిండా గజిబిజిగా అర్థంలేని ఆలోచనలు. రాత్రి రెండుగంటల వరకు అలా తిరుగుతూనే వున్నాను. చివరికి బాగా అలసిపోయాను.

అలసటకుతోడు నిద్ర ముంచుకు వస్తోంది. అలాంటి సమయంలో నాకళ్ళకు ఒక ఇంటిముందు విశాలంగా వున్న అరుగులు కనిపించాయి.

వెంటనే వెళ్ళి ఒక అరుగుమీద ముడిచి పెట్టుకుని పడుకున్నాను. ఏ దొంగ అయినా నా దగ్గరున్న సొమ్ము దోచుకు వెళతాడన్న భయం లేదు. అందుకే నిశ్చింతంగా నిద్రపోయేను.

మెలకువ వచ్చేసరికి తెల్లవారింది. కళ్ళు తెరిచేసరికి ఎదురుగా ఉన్న చిన్న హోటల్ కనిపించింది. చిన్న పాకలో అయిదారు వంకర టింకర బెంచీలు ఉన్నాయి. వాటిమీదే కూర్చుని తింటూ కనిపించారు మనుషులు.

లేచివెళ్ళి ఆ హోటల్ దగ్గరే ముఖం కడుకున్నాను. టిఫిన్ చేద్దామంటే జేబులో పైసా కూడా దొరకలేదు.

కొంచెం ఎండ ముదిరేవరకూ అక్కడా అక్కడా తిరిగివచ్చాను అకలి పెరుగుతోంది కానీ, తగ్గటం లేదు. అప్పటికే వీధికుళాయి దగ్గర రెండుసార్లు నీళ్ళు తాగాను. అయినా ఆకలి నాప్రాణం తీస్తోంది.

చివరికి ఒక విధమయిన తెగింపు వచ్చింది. కడుపు నిండా తిని బిల్లు ఇవ్వకుండా బయటకు వచ్చేద్దామనుకున్నాను. కాని భయమేసింది. పట్టుబడితే దెబ్బలు తప్పవు. అంతకంటే ముందుగానే నా కథను ఆయనతో- అంటే కౌంటర్లో కూర్చున్న ఆ హోటల్ యజమానితో చెప్పుకోవటం మంచిదనిపించింది. నాకళ్ళకు ఆయన మంచివాడిలాగే కనిపించాడు. ఆయన అప్పుడప్పుడూ తెలుగు మాట్లాడుతుండటం నా చెవిన పడింది.

మెల్లగా అయన దగ్గరకు వెళ్ళి నిలుచున్నాను. ఏమిటని అడిగారాయన.

నా కథనంతా వివరంగా చెప్పాను.

ఆయన "అయ్యో, అట్లానా" అన్నాడు జాలిగా. తర్వాత ఒక సర్వర్ని పిలిచి నాకు తిన్నంత టిఫిన్ పెట్టమని చెప్పాడు. వెళ్ళిబెంచీ

మీద కూర్చున్నాను. ఆకలి తీరేవరకూ తిన్నాను. తర్వాత నీళ్ళుతాగి, ఆయన దగ్గరకువచ్చి నమస్కరించి కృతజ్ఞతలు తెలియజేసుకున్నాను.

"నీకు పని ఇస్తాను, చేస్తావా ?" అడిగాడాయన– నేను వెతు తున్నానని చెప్పగానే.

"చేస్తాను" అన్నాను.

"ఏ పనయినా చేస్తావా ?" మళ్ళీ అడిగాను.

"ఏదయినా చేస్తాను సార్" అన్నాను.

"సర్వింగ్ చేస్తావా ?"

"చేస్తాను" వెంటనే అన్నాను.

ఆయన కొంచెంసేపు మాట్లాడలేదు. తర్వాత తనలో తనే ఏదో అనుకుని "వద్దు నువ్వు మంచివాడిలా వున్నావ్. చదువుకున్న వాడివి. నువ్వు కాబట్టి నీ పరిస్థితిని వివరించి టిఫిన్ పెట్టించమని మంచిగా అడిగావ్. ఇంకో మనిషయితే పొట్టనిండా తిని దర్జాగా వెళ్ళిపోయే వాడు. నువ్వు సర్వింగ్ చెయ్యలేవు. అందుకని ఈ కౌంటర్లో ఉండు" అన్నాడాయన.

ఆయన పేరు అరుణాచలం.

నాకు సంతోషమయింది. ఉద్యోగం వెతుక్కోకుండానే దొరి కింది. రెండు పూటలా భోజనంపెట్టి, టిఫిన్‌పెట్టి నెలకు ముప్ఫయి రూపాయిలు జీతం ఇస్తానన్నాడు. సరేనన్నాను. ఆ మరురోజు నించే నేను కౌంటర్లో కూర్చోవటం మొదలుపెట్టాను.

నా మకాం హోటల్లోనే. హోటల్ వెనుకనే మరో గుడిసెవుంది. అందులో అరుణాచలం- ముగ్గురు పిల్లలూ ఉంటారు. ఆయనకు భార్య లేదు. ఒక కూతురు, ఇద్దరు కొడుకులు. కూతురి పేరు అలివేలు. పెళ్ళిడుకు వచ్చింది.

రెండు నెలలు ఇట్టే గడిచిపోయాయి. ఒకరోజు రాత్రి అరుణా చలం నన్ను అలివేలును చేసుకోమని అడిగాడు. నేను కొంచెం ఆలో చించి చేసుకోటానికి అంగీకరించాను.

అలివేలు కొంచెం నలుపన్న మాటేగానీ అందంగా ఉండేది. అదీగాక నేనంటే బాగా అభిమానం చూపించేది. నేను ఒప్పుకున్న ఇరవై రోజులకే అలివేలుతో నా పెళ్ళి చాలా సాధారణంగా జరిగి పోయింది. పెళ్ళయిన తర్వాత హోటలు బాధ్యతను పూర్తిగా నామీదనే వదిలేశాడు అరుణాచలం.

రెండేళ్ళు ఇట్టే గడిచిపోయాయి. ఈ రెండేళ్ళలో జరిగిన మార్పులు- నాకు ఒక ఆడపిల్ల పుట్టటం. నా మామగారైన అరుణాచలం చనిపోవటం. ఆ తర్వాత రెండేళ్ళకే మరో ఇద్దరు పిల్లలను సృష్టించాను. నా బావమరుదులిద్దరూ ఆ హోటల్లోనే పనిచేసేవాళ్ళు. అలివేలితో పాటు వాళ్ళిద్దరికీ కూడా చదువురాదు.

జీవితంలో స్థిరపడ్డారనుకున్న తర్వాత అప్పటికి నేను రాజ మండ్రి వదిలొచ్చి ఐదేళ్ళు కావస్తుందని గుర్తుకొచ్చిన తర్వాత తిరిగి ఆంధ్ర ప్రాంతానికి వెళ్ళిపోదామన్న కోరిక రానురాను చాలా తక్కువ కాలంలోనే విపరీతంగా పెరిగిపోయింది.

మొదట్లో కుటుంబాన్ని రాజమండ్రికి తరలిద్దామనుకున్నాను. కాని నా మనసులో మరో స్వార్థపు ఆలోచన తలెత్తింది. నేను పెళ్ళి చేసుకున్నట్టు పిల్లల్ని కనినట్టు ఎవ్వరికీ తెలీదు. అలాంటప్పుడు వీళ్ళందరినీ అక్కడకు ఎందుకు తీసుకు వెళ్ళాలి ? లేనిపోని బరువు.. బాధ్యత. నామటుకు నేను ఎట్లాగయినా బ్రతకగలనన్న ధీమా నాలో ఏర్పడింది. అందుకే నేను ఒక్కడినే కుటుంబాన్ని విడిచి రాజమండ్రి వెళ్ళాలనుకున్నాను.

ఇలా అనుకున్న వారం రోజులకే- ఒక సాయంత్రం వేళ ఏదో పనిమీద బయటకు వెళుతున్నానని చెప్పివెళ్ళి రాజమండ్రి రైలెక్కేశాను.

నారాక మావాళ్ళను ఆశ్చర్యంలో ముంచింది. వాళ్ళంతా నేను చచ్చిపోయాననుకున్నారు. మా కుటుంబ పరిస్థితిలో చెప్పుకోతగిన మార్పు కనిపించలేదు గానీ మా మామయ్య ఒకాయన బాగా పైకొచ్చాడు. నేను వెళ్ళిన ఏడాదికి ఆయన కొన్ని వస్తువుల ఎగుమతి వ్యాపారం మొదలు పెట్టాడుట. నాలుగేళ్ళలో బాగా కలిసొచ్చింది. వ్యాపారం జోరుగా సాగుతోంది. నేను వచ్చానని తెలియగానే ఆయన నా దగ్గరకు వచ్చాడు. కొంచెంసేపు మాట్లాడిన తర్వాత తనతో కలసి వ్యాపారం చెయ్యమన్నాడు. సంతోషంగా ఒప్పుకున్నాను. నేను మద్రాసులో ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేసినట్టు చెప్పాను.

నేను ఆయనతో కలిసిన తర్వాత వ్యాపారం మరింత వృద్ధయింది. అందుకు ఆయన బాగా సంతోషాన్ని వ్యక్త పరిచాడు. తర్వాత ఆయన ఏకైక కూతుర్నిచ్చి నాకు పెళ్ళిచేశాడు. శ్యామలను చేసుకుంటున్నప్పుడు నాకు అలివేలు, నాపిల్లలు గుర్తుకొచ్చారు. అయినా నేను లెక్కచెయ్యలేదు. మొదట్లో ఇలా అన్యాయం చేశానన్న బాధ పట్టి లాగుతున్నా కొన్నాళ్ళ తర్వాత క్రమంగా ఆబాధ తగ్గిపోయింది.

తర్వాత నాకు ఇద్దరు పిల్లలు పుట్టారు. పెద్దది ఆడపిల్ల. ఇప్పుడు ఇంటర్ చదువుతోంది. రెండోవాడు ఫోర్తుఫారం చదువుతున్నాడు. ఇప్పుడు నాజీవితం గురించి ఎటువంటి భయమూలేదు. మా మామయ్యకు వయసు మీరిపోవటంవల్ల వ్యాపార బాధ్యతలన్నీ పూర్తిగా నాకే వది లేశాడు. ఆ వ్యాపారాన్నే మరింత విస్తృత పరచాలనే ఉదేశ్యంతో ఇప్పుడు- ఇన్నేళ్ళ తర్వాత మద్రాసు నగరం రావటం జరిగింది.

"టాక్సీ కావాలాసార్ !" తమిళంలో అడిగాడు డ్రైవర్ నా పక్కనే టాక్సీఆపి- ఆలోచనల నించి బయటపడ్డాను.

డోర్ తెరుచుకుని ఎక్కాను. అతను ఎక్కడికని అడక్క ముందే "మాంబళం" అని చెప్పాను.

టాక్సీ ముందుకు పోతోంది వేగంగా. చలిగాలి రివ్వున కొడు తోంది.

ఇప్పుడు నేను వెళుతున్నది ఇంతకు ముందు నేనువున్న ఇంటికి. ఇప్పుడు అక్కడే నాభార్య, పిల్లలూ ఉంటారన్న నమ్మకం నాలో ఎంతమాత్రమూ లేదు. ఒకవేళ ఉన్నా వాళ్ళునన్ను గుర్తుపడతారన్న భయమూలేదు. ఇన్నేళ్ళలో నా శరీరంలో ఎంతో మార్పు వచ్చింది. బాగా లావయ్యాను. జుట్టు పెంచాను. గెడ్డం పెంచాను.

టాక్సీ ఆగింది.

దిగి ఫేర్ చెల్లించాను. టాక్సీ వెళ్ళిపోయింది. నడిచాను.

పది నిమిషాలు నడిచిన తర్వాత ఒక రోడ్డులోకి తిరిగాను తిరగ్గానే ఎత్తు అరుగుల ఇల్లు కనిపించింది. అయితే ఆ అరుగుల ఎదురుగా ఇంతకు ముందున్న మా హోటలు కనిపించలేదు. దాని స్థానంలో చిన్న మేడ కనిపించింది. బయట ఎవరిదో డాక్టరు బోర్డు వేలాడుతోంది గేటుకు.

కొంచెంసేపు అక్కడ నిలబడి ముందుకు కదిలాను. కొంచెం దూరం నడవగానే చిన్న సందు వచ్చింది. ఆ సందును కూడా దాటి పదిగజాలు ముందుకు వెళ్ళగానే ఎవరో పరుగెత్తుకు వస్తున్న చప్పుడు వినిపించింది.

ఆగిపోయి వెనక్కు తిరిగి చూశాను. పదిహేనేళ్ళవాడు నా దగ్గరకు వచ్చాడు గబగబా నడిచి.

"సార్....సార్" అన్నాడు వాడు. వాడో ప్యాంటు- పొట్టి షర్టు వేసుకున్నాడు.

"ఏమిటి ?" అడిగాను.

రోడ్డుప్రక్కనే వెలుగుతున్న వీధిదీపం వెలుతురు వాడిమొహం మీద బాగా పడుతోంది. ఆ వెలుతురులో వాడి మొహాన్ని పరీక్షగా చూస్తున్నాను.

"ఎక్కడికి సార్, వెళుతున్నారు ?" అడిగాడు వాడు.

"నీకెందుకు ?" అన్నాను.

"ఏం లేదుసార్, అందుకే అయితే ఇక్కడో మంచి పిట్ట వుంది సార్" అన్నాడు.

వాడిమొహాన్ని పూర్తిగా పరిశీలించిన నేను ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాను- వాడిలో అలివేలుపోలికలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

వీడు అలివేలు కొడుకా- అంటే నాకొడుకా ?!

నేను మాట్లాడకపోవటం చూసి వాడు "చూస్తే మీకే తెలుస్తుంది. రండి సార్" అంటూ ముందుకు కదిలాడు. వాడి వెనుకే వెళితే కాని విషయం తెలీదని వాడితో నడిచాను. అసందు చివరకు తీసుకువెళ్ళాడు. తర్వాత ఒక చిన్న ఇంటిముందు ఆగి తలుపును తట్టాడు. తలుపులు తెరుచుకున్నాయి. లోపల చిరు చీకటిగా వుంది. సన్నని కాంతి బయటకు పడుతోంది.

"లోపలకు వెళ్ళండి సార్"అన్నాడు వాడుబయటనే వుండిపోయి.

అదురుతున్న గుండెలను అదుపులో ఉంచుకుంటూ లోపలకు వెళ్ళాను. వెళ్ళగానే తలుపులు మూసుకున్నాయి. తలుపులు మూసుకో

గానే ఆగదిలో మరోదీపం వెలిగింది. ఆదీపం వెలుగులో గోడవారగా స్విచ్ బోర్డు దగ్గర నిలబడిన అమ్మాయిని చూడగానే షాక్ కొట్టినట్ల యింది. ఇరవై ఏళ్ళుంటాయి.

మొత్తం అలివేలులా వుంది. నేను పెళ్ళి చేసుకునే నాటికి అలివేలు అలాగే వుంది.

నన్ను చూసి సన్నగా నవ్వింది ఆ అమ్మాయి.

మరోషాక్...., ఆ నవ్వుకూడా అలివేలు నవ్వే సందేహం లేదు. ఆ అమ్మాయి తప్పకుండా నా కూతురే.

అయినా అనుమాన నివృత్తి కోసం అడిగాను.

"నీ పేరు ?"

"ప్రసూన"

తూలి పడబోయాను. అదే పేరు. ఆ రోజున అలివేలు నాలో గొడవపడి ఆ పేరు పెట్టింది. అది తనతల్లి పేరుట.

ఎంత నీచమయిన పరిస్థితి....కన్న కూతురి దగ్గరకు తండ్రే విటుడుగా రావటం లాంటిది. నా కూతురు ఒళ్ళమ్ముకుని జీవిస్తుందా ?

నా మనసు విలవిల్లాడింది.

"మీ అమ్మ పేరు అలివేలు కదూ ?" కొంచెం సేపటి తరువాత అడిగాను.

విస్తుబోయింది నా కూతురు.

"అవును. మీకెలా తెలుసు ?" ఆశ్చర్యంగా అడిగింది.

"బాగానే తెలుసు" అన్నాను.

"ఇప్పుడు ఎక్కడుంది ?"

"ఈ లోకానికి చాలా దూరంలో...."

"అంటే ?"

"ఎనిమిదేళ్ళ క్రితమే చనిపోయింది."

"అలివేలూ" మనసులోనే విలపించాను. ఆవార్త విన్న వెంటనే నేను చచ్చిపోతే బావుండుననిపించింది. వాళ్ళను వదిలి వెళ్ళినప్పుడు లేని బాధ ఇప్పుడు వాళ్ళు గడుపుతున్న జీవితాన్ని చూస్తుంటే గుండె లను పిండేసింది.

నాకూతురు మానాన్ని అమ్ముకుని బతకటానికి కారణం ఎవరు?

దానికి తమ్ముడే బేరాలు కుదర్చటానికి కారణం ఎవరు ?

అన్నిటికీ నేనే బాధ్యుణ్ణి. ఈ పాపం నాదే.

నా కళ్ళ ఎదురుగా ఉన్న నిజం నా గుండెను రంపపు కోత కోస్తున్నా ఆబాధను నా మొహంలో కనపడ నీయలేదు.

నేను తమ కుటుంబానికి పరిచయమున్న వ్యక్తినని అనుకున్న దేమో ప్రసూన- మాట్లాడకుండా కూర్చుంది.

నాకు అక్కడ నిముషం కూడా వుండబుద్ధి కాలేదు. ప్రసూన ఇంకా ఏదయినా మాట్లాడితే నాకు పిచ్చెక్కుతుందేమో ననిపించింది.

పాంటు జేబులోనించి పర్సు బయటకు తీశాను. అందులోంచి రెండువందల రూపాయల నోట్లుతీసి నా కూతురికి ఇవ్వబోయాను.

"ఎందుకు ?" అన్నది.

"ఫర్వాలేదు ఉంచుకో- నీ తండ్రి లాంటివాణ్ణి."

"ఇంతకీ మీరెవరు ?" అడిగింది.

"మీ నాన్నకు స్నేహితుణ్ణి."

"మా నాన్నకు స్నేహితులా ?"

"అవును"

"మానాన్న ఎక్కడున్నాడు ?" ఆత్రంగా అడిగింది.

"ఎందుకు ?"

"నాపగ తీర్చుకోవటానికి." కోపంగా అన్నది.

గతుక్కుమన్నాను. నిజమే ప్రసూన అలా అనటంలో ఆశ్చర్యం లేదు. నేను వాళ్ళకు చేసిన అన్యాయానికి ఎవరైనా నా మీద పగ తీర్చుకోవాలనే చూస్తారు.

"అది జరిగే పని కాదు" అన్నాను.

"ఎందుకు ?"

"మీ నాన్న పదిహేనేళ్ళ క్రితమే చచ్చిపోయాడు."

త్రుళ్ళిపడింది ప్రసూన. కొంచెం బాధ ఆ అమ్మాయి కళ్ళలో కదలాడింది.

"ఈ డబ్బు తీసుకో" అన్నాను.

"వద్దు. మీరే ఉంచుకోండి" అన్నది మొండిగా.

నిజమే. నా దగ్గర్నుంచి పూరికే అంతడబ్బు ఆ అమ్మాయి ఎందుకు తీసుకుంటుంది ?

ఏదో ఆలోచిస్తూ అలాగే నిలబడి పోయింది.

నేను మరోసారి నాకూతుర్ని చూసి "వెళుతున్నాను" అని తలుపులు తెరుచుకుని బయటకు వచ్చాను.

బయట ఎక్కడా నన్ను పిల్చుకు వచ్చినవాడు కనిపించలేదు. వాడు నాకొడుకే. ఇంకొకడు వుండాలి ? ఎక్కడ వున్నాడో ? నా గుండె బరువెక్కింది.

గబగబా సందు చివరకు నడిచాను. అక్కడ నిలబడి మరో విటుడికోసం ఎదురుచూస్తున్న నాకొడుకు కనిపించాడు. వాడిదగ్గరకు వెళ్ళగానే,

"అప్పుడే వెళ్ళిపోతున్నారేం, సార్ ?" అన్నాడు.

నాకు ఏడుపొచ్చింది. ఎలాగో దిగమింగుకుని పర్సులోనుంచి డబ్బుతీసి వాడి చేతిలో వుంచాను. అంతడబ్బు వాడికి ఇంతకుముందు ఎవ్వరూ ఇవ్వలేదేమో- "థాంక్స్ సార్. రేపుకూడా రండి" అన్నాడు కృతజ్ఞతతో.

పగిలిపోవటానికి సిద్ధంగావున్న గాలిబుడగలావుంది నాపరిస్థితి.

పని అయిపోగానే రాజమండ్రి వెళ్ళిపోయినా బావుండేదని పించింది. మద్రాసు నగరం ఇన్నేళ్ళ తర్వాత నా గుండెలమీద గట్టి దెబ్బే కొట్టింది. ఇక నిముషం కూడా మద్రాసులో ఉండాలనిపించ లేదు. పెద్దపెద్ద అంగలతో రోడ్డుమీదకు వచ్చేసరికి ఖాళీగా వెళుతున్న టాక్సీ కనిపించింది. ఆపి ఎక్కి కూర్చుని ఎడ్రసు చెప్పాను. టాక్సీ కదిలింది. దాటిపోతున్న పరిసరాలన్నీ నీళ్ళునిండిన నా కళ్ళకు అలుక్కుపోయి నట్లు కనిపిస్తున్నాయి.

(21-3-1979 – ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక) *